# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 06-11-2024 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ ఛత్ పండుగ సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.
- ❖ ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన ఈరోజు ఢిల్లీలో జరిగిన కేంద్రమంత్రి వర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు.
- ❖ దేశంలోని యువత తమ కలలను సాకారం చేసుకునేందుకు ప్రధానమంత్రి విద్యాలక్ష్మి పధకం దోహదపడుతుందని కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ అన్నారు.
- ❖ అమెరికా అధ్యక్ష ఎన్నికలలో డొనాల్డ్ ట్రంప్ విజయం సాధించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఛత్ పండుగ సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము దేశ పౌరులకు శుభాకాంక్షలు తెలిపారు. దేశంలోని పురాతన పండుగలలో ఒకటైన ఛత్ పూజలో సూర్యుడిని ఆరాధిస్తామని, ఈ పండుగతో ప్రకృతి సిద్ధమైన నదులు, చెరువులు పూజింపబడతాయని అన్నారు. అలాగే మన పర్యావరణాన్ని పరిరక్షించుకోవడానికి ఛత్ పండుగ స్ఫూర్తినిస్తుందన్నారు. ఛత్ పూజ సందర్భంగా, సూర్య భగవానుని ఆశీస్సులు మన అందరిపై ఉండాలని అన్నారు. ఈ పండుగ అందరి జీవితాల్లో ఆనందాన్ని తీసుకురావాలని, ప్రకృతి పట్ల మనకున్న గౌరవం మరింత పెరగాలని కోరుకుంటున్నానని రాష్ట్రపతి సామాజిక మాధ్యమంలో పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన ఈరోజు ఢిల్లీలో జరిగిన కేంద్రమంత్రి వర్గ సమావేశంలో పలు నిర్ణయాలకు మంత్రివర్గం ఆమోదం తెలిపిందని సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు. సమావేశం అనంతరం కేంద్రమంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ... ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకు 10,700 కోట్ల రూపాయల ఈక్విటీని అందించాలని నిర్ణయించామన్నారు. ఆహార సేకరణలో కీలక పాత్ర పోషిస్తోన్న ఎఫ్‌సీఐని గణనీయంగా బలోపేతం

చేయాలన్నే ఉద్దేశ్యంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. అలాగే ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించేందుకు ప్రధానమంత్రి-విద్యాలక్ష్మి పథకానికి కేంద్ర మంత్రి వర్గం ఆమోదం తెలిపిందని ఆయన వెల్లడిస్తూ...

(వాయిస్ 45 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశంలోని యువత తమ కలలను సాకారం చేసుకునేందుకు ప్రధానమంత్రి విద్యాలక్ష్మి పథకం దోహదపడుతుందని కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ అన్నారు. 3,600 కోట్ల రూపాయలతో కేంద్ర మంత్రి వర్గం ఈ పథకానికి ఆమోదం తెలపడం పట్ల కేంద్రమంత్రి హర్షం వ్యక్తం చేశారు. ఈ కేంద్ర ప్రభుత్వ పథకం ప్రతిభావంతులైన విద్యార్థులకు ఉన్నత విద్యను పొందేందుకు పూచీకత్తు లేకుండా విద్యా రుణాలు అందిస్తుందని సామాజిక మాధ్యమం వేదికగా ఆయన పేర్కొన్నారు. కుటుంబ వార్షిక ఆదాయం 8 లక్షల రూపాయల వరకు ఉన్న విద్యార్థులు 10 లక్షల రూపాయల వరకు విద్యా రుణాలపై 3 శాతం వడ్డీ రాయితీని పొందేందుకు అర్హులని కేంద్రమంత్రి వెల్లడించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

అమెరికా అధ్యక్ష ఎన్నికలలో రిపబ్లిక్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ డెమోక్రెటిక్ అభ్యర్థిని కమలాహారీస్‌పై విజయం సాధించారు. దీంతో డొనాల్డ్ ట్రంప్ రెండవ సారి అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. 538 ఎలక్టోరల్ ఓట్లు కలిగిన అమెరికాలో రిపబ్లిక్ పార్టీకి 277కు పైగా మెజార్టీ లభించింది. దీనితో ట్రంప్ ఎన్నిక లాంఛనమయ్యింది. ఎన్నికల ఫలితాల సందర్భంగా డొనాల్డ్ ట్రంప్ మాట్లాడుతూ... ఈ రాజకీయ మార్పు అమెరికాను ముందుకు తీసుకెళ్లేందుకు దోహదం చేస్తుందని అన్నారు. ఈ సందర్భంగా దేశ ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేశారు.

కాగా అమెరికా ఎన్నికల్లో విజయం సాధించిన డొనాల్డ్ ట్రంప్‌కు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుభాకాంక్షలు తెలియజేశారు. భారతదేశం-అమెరికా సమగ్ర ప్రపంచ, వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడానికి తమ సహకారాన్ని అందించేందుకు సిద్దంగా ఉన్నామని సామాజిక మాధ్యమంలో పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఉత్తరప్రదేశ్‌లోని హర్దోయ్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ సంతాపాన్ని తెలియజేశారు. ఈమేరకు సమాజిక మాద్యంలో ఒక ప్రకటన చేస్తూ.. ప్రమాదంలో గాయపడిన వారందరూ త్వరగా కోలుకోవాలని అన్నారు. హర్దోయ్ ఘటన విచారకరమైనదని, భాదిత కుటుంబాలకు శక్తిని ఇవ్వాలని ఆ భగవంతుని కోరుకుంటునాన్నారు. ప్రమాదంలో మరణించిన ప్రతి కుటుంబానికి ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధి నుండి 2 లక్షల రూపాయలు, గాయపడిన వారికి 50 వేల రూపాయల పరిహారాన్ని ప్రధానమంత్రి ప్రకటించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ ఈరోజు కాన్‌బెర్రాలో ఆస్ట్రేలియా ప్రధానమంత్రి ఆంటోనీ అల్బనీస్‌తో సమావేశమయ్యారు. భారత్, ఆస్ట్రేలియా దేశాల సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని ఈ సమావేశం మరింత బలోపేతం చేస్తోందని అన్నారు. ఆస్ట్రేలియన్ ప్రధానమంత్రి ఇరు దేశాల సంబందాలను పటిష్టం చేసేందుకు ఎంతో విలువైన మార్గదర్శకాలు సూచించారని మంత్రి జైశంకర్ తెలిపారు. అలాగే జైశంకర్ న్యూజిలాండ్ విదేశాంగ మంత్రి విన్‌స్టన్ పీటర్స్‌తో కాన్‌బెర్రాలో సమావేశం నిర్వహించారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

నీటి నిర్వహణ, పరిరక్షణ, సుస్థిరత పట్ల అవగాహన కల్పించేందుకు నీతి ఆయోగ్ ఈరోజు నుండి 15 రోజుల 'జల్ ఉత్సవ్'ను కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈరోజు నుంచి 15 రోజులపాటు 20 ఆశావాహ జిల్లాలలొ జల్ ఉత్సవ్‌ను నిర్వహిస్తామని నీతి ఆయోగ్ తెలిపింది. జల్ జీవన్ మిషన్, డ్రింకింగ్ వాటర్ అండ్ శానిటేషన్ డిపార్ట్‌మెంట్, జల్ శక్తి మంత్రిత్వ శాఖ భాగస్వామ్యంతో ఈ కార్యక్రమం నిర్వహించబడుతుంది. 20 రాష్ట్రాలలో ప్రారంభించిన ఈ ఉత్సవం నీటి వనరుల సంరక్షణ, పరిరక్షణలో సమాజ భాగస్వామ్యాన్ని, అలాగే గృహాలలో సమర్థవంతమైన నీటి వినియోగం, నిర్వహణ పట్ల బాధ్యత భావాన్ని తెలియజేస్తుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రముఖ జానపద గాయని శారదా సిన్హా మృతి పట్ల రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సంతాపం వ్యక్తం చేశారు. శారద సిన్హా మైథిలీ భోజ్‌పురిలోని బీహారీ జానపద పాటలకు తన మధురమైన గాత్రాన్ని అందించి సంగీత ప్రపంచంలో అపారమైన ప్రజాదరణ పొందారని రాష్ట్రపతి సామాజిక మాధ్యమంలో పేర్కొన్నారు. “ఛత్” పూజకు సంబంధించి శారదాసిన్హా మధురమైన పాటల ప్రతిధ్వని ఎప్పటికీ నిలిచి ఉంటుందని, ఆమె మృతి సంగీత ప్రపంచానికి తీరని లోటు అని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఛత్ పండుగ సందర్భంగా రైల్వేశాఖ ప్రత్యేక రైళ్లను నడుపుతోంది. ఢిల్లీ-NCR నుండి దేశంలోని తూర్పు ప్రాంతాలకు 25 ప్రత్యేక రైళ్లను నడుపుతోందని ఉత్తర రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ హిమాన్షు శేఖర్ ఉపాధ్యాయ్ ఆకాశవాణికి తెలియజేశారు. సాధారణ తరగతిలో ప్రయాణించే ప్రయాణీకుల కోసం ఈ రైళ్లను నడుపుతున్నామని తెలిపారు. ఈ సంవత్సరం పండుగల సీజన్‌లో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని భారతీయ రైల్వే అక్టోబర్ 1వ తేదీ నుంచి ఈ నెల 30వ తేదీ వరకు దాదాపు 7 వేల ప్రత్యేక సర్వీసులను నడుపుతోంది. ఈ ప్రత్యేక రైళ్లలో రోజు 2 లక్షల మంది అదనపు ప్రయాణికులు ప్రయాణించవచ్చు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు భారీ లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 79,771 వద్ద లాభాల్లో ప్రారంభమై 900 పాయింట్ల లాభంతో 80,378 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 270 పాయింట్ల లాభంతో 24,484 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 84.30గా ఉంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దక్షిణాఫ్రికా, భారత్ పురుషుల జట్ల మధ్య టీ-20ల సిరీస్ నవంబర్ 8 నుండి ప్రారంభం కానుంది. తొలి మ్యాచ్ దర్బన్ వేదికగా జరుగుతుంది. ఇప్పటికే భారత జట్టు దక్షిణాఫ్రికాకు చేరుకొంది. భారత జట్టుకు సూర్యకుమార్ యాదవ్, సౌతాఫ్రికాకు మార్క్రమ్‌లు కెప్టెన్లుగా వ్యవహరించనున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఝార్ఖండ్, మహారాష్ట్రాలలో అసెంబ్లీ ఎన్నికలనేపథ్యంలో రాజకీయ పార్టీలు ప్రచారాన్ని ముమ్మరం చేశాయి. మహారాష్ట్రలోని నాగపూర్ లో కాంగ్రెస్ పార్టీ నేత రాహుల్ గాంధీ ఎన్నికల ప్రచార సభలో పాల్గొన్నారు. మరోవైపు ఝార్ఖండ్ లోని జగన్నాథ్‌పూర్ అసెంబ్లీ నియోజకవర్గంలోని చోటా నాగ్రాలో ఎన్నికల సభలో జేఎంఎం సీనియర్ నేత, ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ పాల్గొన్నారు. RJD, AJSU , CPI-ML నాయకులు కూడా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యురాలు బృందా కారత్ ఈరోజు నుంచి ఈ నెల 10వ తేదీ వరకు ఎన్నికల సభల్లో ప్రసంగించనున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశం స్వావలంబనను ప్రోత్సహిస్తూ.. భారత సైన్యం ఉత్తర కమాండ్‌లో 550 'అస్మి' మెషిన్ పిస్టల్‌లను చేర్చింది. డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (DRDO) భాగస్వామ్యంతో ఇండియన్ ఆర్మీకి చెందిన కల్నల్ ప్రసాద్ బన్సోడ్ ఈ ఆయుధాలను తీసుకువచ్చారు. హైదరాబాద్‌లోని ఓ భారతీయ కంపెనీ దీనిని తయారు చేస్తోంది. ఈ మేడ్-ఇన్-ఇండియా ఆయుధం, ఆత్మనిర్భర్ భారత్ అభియాన్ పట్ల సైన్యం నిబద్ధతను ఇది తెలియజేస్తుంది.

===========================
===========================